సాక్షి సిద్దిపేట

సోమవారం, 8, సెప్టెంబర్, 2025

శోభాయాత్ర తిలకించడానికి వచ్చిన ప్రజలు



ప్రశాంతంగా నిమజ్జనం



క్రేన్ సహాయంతో గంగమ్మ ఒడికి గణనాథుడు

డీజే సౌండ్లు, భక్తుల కోలాహలం, పోలీసు బందోబస్తు మధ్య వినాయక నిమజ్జనోత్సవ శోభాయాత్ర దుబ్బాకలో శనివారం రాత్రి ప్రారంభమై ఆదివారం సాయంత్రానికి ప్రశాంతంగా ముగిసింది. డీజే పాటలకు మహిళలు, యువతీ యువకుల నృత్యాలు, మహారాష్ట్ర మహిళల బ్యాండ్ ట్రూప్‌లతో శోభాయాత్ర కనుల విందుగా సాగింది. నిమజ్జనానికి వివిధమండపాలనుంచి వివిధ ఆకృతుల్లో తీసుకువచ్చిన వినాయక విగ్రహాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. – దుబ్బాకటౌన్



శోభాయాత్రలో కాళికామాత భారీ శకటం



చెరువు కట్టపై క్యూలో వినాయకులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహారాష్ట్ర బ్యాండ్

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి క్రీడా పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12 వరకు 69వ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 బాలురు, బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ విభాగాల్లో పోటీలు నిర్వహించి, ఇందులోనుంచి జిల్లా స్థాయి జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు ప్రభుత్వం బాలుర ఉన్నత పాఠశాలలో, క్రికెట్ స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

లడ్డూను దక్కించుకున్న ముస్లిం



వేలంలో దక్కించుకున్న లడ్డూతో జహంగీర్

మద్దూరు(హుస్నాబాద్): ధూళ్మిట్ట మండలం లోని బైరాన్ పల్లి గ్రామంలో శివ భజరంగి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలందుకున్న గణపతి లడ్డూను వేలంపాటలో అదేగ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మొహమ్మద్ జహంగీర్ దక్కించుకున్నారు. శనివారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.14,916కు జహంగీర్ దక్కించుకున్నారు. కాగా, హిందూ పండుగలో ముస్లిం యువకుడు భాగస్వామి కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నాచగిరి ఆలయ ద్వారబంధనం



ఆలయ ద్వారం మూసివేస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నాచగిరి ఆలయాన్ని మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం యథావిధిగా పూజాకార్యక్రమాలు కొనసాగుతాయని, భక్తులకు దర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి విజయ రామారావు తెలిపారు.

వంటేరుకు ప్రముఖుల పరామర్శ



ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మాతృవియోగంతో బాధపడుతున్న గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ పరామర్శించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్

సిద్దిపేటజోన్: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు పరమేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ ప్రతినిధులు బలరాం, వికాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అదను దాటితే అంతే సంగతులు!



యూరియా వేయకపోవడం వల్ల జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో ఎదుగుదల లోపించిన వరి

యూరియా లేక.. పంటలు

- ఎదిగే సమయంలో తీవ్రమైన కొరత
- అతివృష్టితో దెబ్బతిన్న పంటలు
- రికవరీ చేసుకునే అవకాశం కరువు
- వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు అపార నష్టం
- సిద్దిపేట జిల్లాలో పరిస్థితిపై 'సాక్షి' పరిశీలన

సాక్షి పరిశీలన

గజ్వేల్: యూరియా కొరత తీవ్ర పంట నష్టాన్ని కలిగిస్తున్నది. ఎదుగుదల లోపించడం, తెగుళ్ల వ్యాపించడంతో ఇప్పటికే వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు అతివృష్టి వల్ల నీట మునిగిన పంటలను రికవరీ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. కొన్ని చోట్ల రైతులు ఇప్పటికే వానాకాలం పంటలపై ఆశలు వదులున్నారు. సిద్దిపేట జిల్లాలో పంటల పరిస్థితిపై 'సాక్షి' పరిశీలన జరిపింది. జిల్లాలో 4.87లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో వరి 3.40లక్షల ఎకరాలు, మొక్కజొన్న 27,820, ఎకరాలు, కంది 6594 ఎకరాల్లో సాగులోకి రాగా పత్తి 1.06లక్షల ఎకరాల పైగా సాగులోకి వచ్చింది. మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు సాగులోకి వచ్చాయి. కానీ ఈసారి యూరియా కొరత రైతులను కుంగదీస్తున్నది. వానాకాలం సీజన్ మొత్తానికి 40వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. ఇప్పటివరకు కేవలం 28,882 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటలు ఎదిగే కీలకమైన సమయంలో యూరియా ఒక్క బస్తా దొరకడం గగనమవుతుండగా..రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు అల్వాల రాజు. ఈయనది గజ్వేల్ మండలం అక్కారం. తనకున్న రెండున్నర ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. దున్నకాలు, విత్తనాలు, ఎరువులు, కూలీలకు కలిపి సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. రెండుసార్లు యూరియా వేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు వేయలేకపోయాడు. అయిదారు బస్తాల యూరియా దొరికితే పత్తి రివకరీ అయ్యేది. కానీ పరిస్థితి భిన్నంగా ఉండటంతో ఎదుగుల లోపించింది. తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే పత్తిపై పెట్టిన పెట్టుబడి కూడా నష్టపోయే దుస్థితి నెలకొన్నది. ఒక్క రాజుదే కాదు..జిల్లాలోని రైతులందరీ పరిస్థితి ఇది.

యూరియా దొరక్క వరి దెబ్బతింది



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసిన. ఎన్ని రోజుల నుంచి తిరుగుతుండగా, మూడు బస్తాల యూరియా దొరికింది. ఇది ఏ మూలకు సరిపోలేదు. దీనివల్ల పంట ఎదుగుత లేదు. ఇప్పటికైనా యూరియా అందకపోతే పంట మీద ఆశలు చాలించుకోవాల్సిందే.

రైతు లచ్చిరెడ్డి, తీగుల్, జగదేవ్‌పూర్ మండలం

వేలాది ఎకరాల్లో పంట నష్టం

పంటలు ఎదిగే సమయంలో యూరియా దొరక్క వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. మరోవైపు భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను రికవరీ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ప్రత్యేకించి వరికి తీవ్ర నష్టం కలిగింది. జిల్లాలోని చాలా చోట్ల వరద ఉధృతికి వరి ఇసుక మేట వేసి వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. లోతట్టు చేలల్లో పత్తి నీటి మునిగి రంగుమారుతోంది. మరోవైపు వేరుకుళ్లు ఇతర తెగుళ్లు విజృంభించాయి. దీనివల్ల దిగుబడి భారీగా పడిపోయే దుస్థితి నెలకొన్నది. కొన్ని చోట్ల రైతులకు పెట్టుబడి కూడా దక్కని స్థితిలో పంటలు ఉన్నాయి. మొక్కజొన్న పంటకు సైతం భారీ నష్టం జరిగింది. అతివృష్టి వల్ల జిల్లాలో 7759 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. పూర్తి స్థాయి అంచనా కోసం క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నారు. ఇకపోతే అదనుకు యూరియా వేయపోవడం వల్ల జిల్లావ్యాప్తంగా వరి సుమారుగా 20వేల ఎకరాలకుపైగా పత్తి 10వేల ఎకరాలు, మొక్కజొన్న 4వేల ఎకరాలకుపైగా దెబ్బతిన్నట్లు అంచనా.

ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



గజ్వేల్ ప్రెస్‌క్లబ్ రజతోత్సవంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- మద్యం మహమ్మారి, రైతు ఆత్మహత్యలపై పోరాటాలు అభినందనీయం
- గజ్వేల్ ప్రెస్‌క్లబ్ రజతోత్సవంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ ఉద్యమంలో ప్రజలను, అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి కీలకపాత్ర పోషించే విధంగా కృషి చేయడంలో గజ్వేల్ జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని, మద్యం మహమ్మారి, రైతు ఆత్మహత్యలపై పోరాటాలు అభినందనీయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ రజతోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని ఎస్‌ఎల్‌ఎన్ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన సావనీర్ 'కలం పోరు'పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ..కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్లతోపాటు గ్రామీణ ప్రాంత విలేకరులకు బస్‌పాసులు అందించామన్నారు. రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ఈహెచ్‌ఎస్ ఏర్పాటుకు అసెంబ్లీలో చర్చిస్తామని హామీ నిచ్చారు.

గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌కు ప్రత్యేక స్థానం: శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ ప్రాంతంలో గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌కు ప్రత్యేక స్థానముందని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయగా సంబంధిత శాఖ అధికారులను పిలిచి వారంలోగా సమావేశం ఏర్పాటు చేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారని తెలిపారు.

మంచి చేయాలన్నవారే జర్నలిస్టులుగా రావాలి: కొత్త ప్రభాకర్‌రెడ్డి

గ్రామాల్లో ప్రజలకు ఏ సమస్య వచ్చినా జర్నలిస్టుల దృష్టికి తీసుకువెళితే ఆ సమస్య వేగంగా పరిష్కారమయ్యేదనే నమ్మకముండేదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. యూట్యూబ్ చానల్, సోషల్ మీడియా రావడంతో నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులకు గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి మంచి చేయాలన్నవారే జర్నలిస్టులుగా రావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, బేవరేజెస్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, లోక్‌సత్తా తెలుగు ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సృజనాత్మక రచనలపై సదస్సు

మెదక్ కలెక్టరేట్: కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం మెదక్ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి కార్యశాలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ వామనమూర్తి సమన్వయకర్తగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రచనలు, పాట, కవితా రచన అంశాలలో విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

అంగన్‌వాడీలా!

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- ఆట వస్తువుల పరిస్థితి అంతంతే
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



చిన్నకోడూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు బాల్యం నుంచే చదువుపై ఆసక్తి కల్పించే లా ఆట, పాటలతో బోధించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సరైన వసతులు లేకపోవడం వల్ల పిల్లలను అంగన్‌వాడీలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తిచూపడం లేదు. అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో అరకొర వసతులు వేధిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఏడు అద్దె భవనాల్లో

మండలంలో మొత్తం 54 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 28 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలుండగా, 19 కేంద్రాలు అద్దె లేని భవనాల్లో కొనసాగుతుండగా, ఏడు కేంద్రాల్లో అద్దె భవనాల్లో సాగుతున్నాయి. ప్రభుత్వం నెలకు రూ. వెయ్యి అద్దె చెల్లిస్తోంది. అద్దె మొత్తం కంటే ఎక్కువగా ఉంటే టీచర్లు మిగిలిన డబ్బు భరించాలి.

నిలిచిపోయిన నిర్మాణాలు

అద్దె భవనాల్లో ఉన్న కొన్ని కేంద్రాలకు గతంలో భవనాలు మంజూరైనా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరికొన్నింటికి పనులు ప్రారంభం కాలేదు. చిన్నకోడూరులో రెండు భవనాలు, ఎల్లాయపల్లిలో ఒక భవనం నిర్మాణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. అధికారులు స్పందించి భవనాలను పూర్తి చేయాలని కోరుతున్నారు.



ఎల్లాయపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ హైమావతి



విద్యార్థులు భోజనం చేస్తుండగా పరిశీలిస్తున్న కలెక్టర్

కొండపాక(గజ్వేల్): విద్యార్థులకు నాణ్యమైన బోధన, భోజనం అందేలా చూసుకోవాలని కలెక్టర్ హైమావతి సూచించారు. కొండపాకలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను ఆదివారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. రాత్రి పూట అందించిన భోజనాన్ని పరిశీలిస్తూ ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు ఎలా ఉన్నాయన్న విషయమై కలియ తిరుగుతూ పరిశీలించారు. మురికి కాలువలు చెడిపోవడంతో దుర్వాసన వస్తున్న విషయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తేవడంతో స్పందించి వెంటనే పనులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. అక్కడక్కడ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ..కామన్ డైట్ మెనూను పాటించాలన్నారు. విద్యాపరమైన అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపేరు మీద మొక్క నాటాలి

సిద్దిపేటరూరల్: జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు 'ఏక్ పేడ్ మా కే నామ్‌పే' అనే నినాదంతో ప్రతీ అధికారి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కలెక్టర్ కె.హైమావతి ఆదివారం పిలుపునిచ్చారు. 9న తల్లి పేరున ఒక మొక్క స్ఫూర్తితో జిల్లాలోని అధికారులంతా మొక్కలు నాటాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలో గుర్తించిన 13,900ల మంది ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.

కరెంట్.. కట్‌కట

- వ్యవసాయానికి వేళాపాళా లేని విద్యుత్తు కోతలు
- రోజుకు 10 గంటలు కూడా సరఫరా కాని దుస్థితి



మర్పడ్గలోని 32/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో వ్యవసాయ రంగానికి వేళాపాళా లేని విద్యుత్తు కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతు రాజ్యమంటూ గొప్పలు చెపుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ రైతుల సమస్యలను పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఓ పక్క యూరియా కొరత వేధిస్తుండగా మరో పక్క వ్యవసాయ బావులకు త్రీ ఫేజ్ విద్యుత్తు కోతలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. త్రీ ఫేజ్ కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియకపోతుండటంతో రాత్రింబవళ్లు వ్యవసాయ బావుల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

ప్రారంభంలో 12 నుంచి 15గంటలు సరఫరా

వర్షాకాలం వ్యవసాయ సాగు పనులు ప్రారంభంలో ప్రతీ రోజు 12 నుంచి 15 గంటల వరకు త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా జరిగేది. అయితే ఆలస్యంగా వర్షాలు కురవడంతో రెండు మండలాల్లో 3నుంచి 4 గ్రామాల్లో మినహా మిగతా గ్రామాల్లోని చెరువులు నిండటంతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో ఆలస్యంగా వరి నాట్లు వేశారు. కొండపాక మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో, కుకునూరుపల్లి మండలంలో 8 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. కొండపాక మండలంలో 7,452 అధికారిక వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లుండగా, కుకునూరుపల్లి మండలంలో 3,510 వ్యవసాయ అధికారిక విద్యుత్తు కనెక్షన్లుండగా మరికొన్ని అనధికారిక విద్యుత్తు కనెక్షన్ల ద్వారా త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా జరుగుతోంది. ఇందుకుగాను దుద్దెడ, కొండపాక, మర్పడ్గ, బందారం, వెలికట్ట, తిమ్మారెడ్డిపల్లి, మేదినీపూర్, తిప్పారం గ్రామాల్లోని 32/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ల నుంచి వ్యవసాయ బావులకు విద్యుత్తు సరఫరా జరుగుతోంది.

ప్రచారార్భాటం పటాటోపమే

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిమిషమైనా కరెంటు కోతలుండవంటూ ప్రచారం చేసి తీరా అధికారంలోకి రాగానే కరెంటు సరఫరా తీరులను పట్టించుకోవడం లేదంటూ అన్నదాతలు ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో వ్యవయసాయ రంగానికి రోజుకు 18 నుంచి 20 గంటల వరకు సరఫరా జరగ్గా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 8 నుంచి 10 గంటల విద్యుత్తు సరఫరా కూడా కావడం లేదంటూ రైతులు వాపోతున్నారు. విద్యుత్తు శాఖ గజ్వేల్ డీఈ భానుప్రకాశ్‌ను వివరణ కోరగా త్రీ ఫేజ్ విద్యుత్తు సరపరాలో కోతల విషయమై నిర్ధారించడం లేదు.

పొట్ట దశకు చేరుకున్న వరిపంటలు



వర్షాకాలం ప్రారంభ దశలో సాగు చేసిన పంటలు చిరు పొట్ట దశకు చేరుకున్నాయి. ఈ దశలో నీటి వినియోగం ఎక్కువగా అవసరపడుతుందని సమయంలో వేళాపాళాలేని విద్యుత్తు కోతలతో పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం 4 గంటలకు నిలిచిపోయిన త్రీ ఫేజ్ కరెంటు మధ్యరాత్రి సుమారు 2 నుంచి 3 గంటలకు సరఫరా అవుతుందన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక రాత్రి పూట వ్యవసాయ బావుల వద్ద పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ ఫీజు గడువు పెంపు

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ ఫీజు గడువును ఈనెల 20వ తేదీ వరకు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్‌స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ చదవడానికి ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేలంలో లడ్డూను దక్కించుకున్న చిన్నారి


లడ్డూను అందుకున్న మనస్విని

వట్‌పల్లి(అందోల్): ఓ చిన్నారి వేలం పాట పాడి లడ్డూను దక్కించుకుంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో జరిగింది. వివరాలు ఇలా... అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో శనివారం రాత్రి వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా లడ్డూకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన చిన్నారి దేవునూరి మనస్విని పాల్గొని తన పాటను రూ.5వేలతో ప్రారంభించి పోటీపడి వేలం పాట పాడింది. దీంతో అందరూ వెనుకడుగు వేశారు. చివరికి వేలంలో రూ.15100కు లడ్డూను దక్కించుకుంది. కాగా అక్కడున్నవారు చిన్నారిని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. ఉత్సవ నిర్వాహకులు చిన్నారికి లడ్డూను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

విద్యుత్ అంతరాయంపై గ్రామస్తుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్దగొట్టిముక్లలోని పలు వార్డులు, చెన్నాపూర్, టిక్యా, దేవమ్మగూడం తండాల్లో రెండు రోజుల నుంచి విద్యుత్ అంతరాయం నెలకొంది. అంతరాయాన్ని నిరసిస్తూ ఆదివారం రాత్రి పెద్దగొట్టిముక్ల గ్రామంలో కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. త్రీఫేస్‌తోపాటు సింగిల్ ఫేస్ విద్యుత్ రాకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు నర్సింలు, మహేశ్, పుణ్యాలు, గొల్ల రాములు తదితరులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయం గురించి ఏఈ రాకేశ్ దృష్టికి తీసుకెళ్లగా... తిమ్మాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పలు గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్‌లో నెలకొన్న సమస్య మూలంగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. అప్పటి వరకు సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. సోమవారం పూర్తి స్థాయిలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తామన్నారు.

బైకును ఢీకొట్టిన ట్రాక్టర్

- వ్యక్తికి తీవ్ర గాయాలు
- పిండి పట్టించేందుకు వెళ్తుండగా ఘటన

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మెదక్ -జోగిపేట రహదారి రంగంపేట గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిలప్ చెడ్ గిరిజన తండాకు చెందిన మెగావత్ టోప్యా గిర్నీలో పిండి పట్టించేందుకు తన బైక్‌పై అల్లుడు విఠల్‌తో కలిసి రంగంపేటకు వస్తున్నారు. ఇదే సమయంలో గనేట్ రాయితో దుంపలకుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ ప్రధాన రహదారి ఎర్రమట్టి తండాకు వెళ్లే దారి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ వెనక కూర్చున్న టోప్యా తలకు తీవ్ర గాయమై, రక్తస్రావమైంది. బైక్ నడుపుతున్న విఠల్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఇద్దరిని అంబులెన్స్‌లో జోగిపేట ఆస్పత్రికి తరలించారు. టోప్యా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీకి తరలించారు.

మహిళ అదృశ్యం


సీమ

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాము బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4న రాము భార్య సీమ డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. భార్య కోసం తెలిసిన వారి వద్ద , స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెదిరిపోతున్న చరిత్ర

రాజగోపాల్ పేట కోటకు బీటలు

కనుమరుగవుతున్న కట్టడాలు ● ఉనికిని కాపాడాలని గ్రామస్తుల వినతి


కూలుతున్న బురుజు రాతి కట్టడం


చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్న రాజగోపాల్‌పేట కోట

రాజుల పాలనలో ఎత్తైన కోట, రక్షణ కోసం బురుజు, సొరంగాలు, రాణీ సౌధాలు, సిరి సంపదలతో కళకళలాడింది మండలంలోని రాజగోపాల్ పేట. నాడు 70 గ్రామాలకు కేంద్రంగా ఉన్న ఈ గ్రామం రజాకార్ల పాలన అంతం కావడంతో మొట్టమొదటి నియోజకవర్గంగా ఏర్పడింది. కాలక్రమేణా గ్రామానికి ప్రాధాన్యత తగ్గడం, పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడటంతో నేడు సాధారణ గ్రామ పంచాయతీగా మారింది. అలాగే నాటి వైభవం అంతరించి చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు కావడంతో నేడు చెదిరిన కోట గోడలు, కనుమరుగైన ఆనవాళ్లు, పిచ్చి మొక్కలతో రాజ సౌధం నిండిపోయింది.

– నంగునూరు(సిద్దిపేట):

క్రీ.శ.1309 వరకు కాకతీయుల పాలనలో దేశ్‌ముఖ్‌లు ఇక్కడ గుళ్లు, గోపురాలు, కోటలు కట్టించి రాజగోపాలపురంగా నామకరణం చేశారు. ఎత్తైన కోట, రాజు, రాణీ గృహాలు, పరిచారికలకు గదులు, తాగునీటి కోసం చేదబావి, రాతి బురుజును నిర్మించి సమీపంలోనే పెద్ద చెరువును తవ్వించారు. ఈ ప్రాంతాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని సిద్దిపేట, చేర్యాల, బెజ్జంకి, నంగునూరు, హుస్నాబాద్ మండలాల్లోని 70 గ్రామాల్లో కోటలు కట్టించి పరిపాలన సాగించారు. శత్రువుల నుంచి తప్పించుకునేందుకు రాజు గది నుంచి ముంద్రాయిలోని లక్ష్మినర్సింహ స్వామి గుట్ట వరకు సొరంగ మార్గం తవ్వించారని గ్రామస్తులు చెబుతున్నారు. సుదీర్ఘ కాలంగా సామంత రాజులుగా ఉన్న దేశ్‌ముఖ్‌లు కాకతీయులకు కప్పం కడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వరకు ఈ ప్రాంతాన్ని పరిపాలించారని తెలుస్తోంది.

మొట్ట మొదటి నియోజకవర్గం

1982లో రాజగోపాల్‌పేట నియోజకవర్గంగా ఏర్పాటైంది. కాంగ్రెస్ అభ్యర్థి కేవి నారాయణరెడ్డి గెలుపొంది మొట్టమొదటి ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టాడు. 1985లో ప్రభుత్వం మండల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో జనాభా ప్రాతిపాదికన సిద్దిపేట నియోజకవర్గం ఏర్పాటైంది. రాజగోపాల్‌పేట నంగునూరు మండల పరిధిలోకి రావడంతో సాధారణ గ్రామ పంచాయతీగా మారింది.


కోటగోడ ముఖ ద్వారం

చరిత్ర కనుమరుగు

ఎంతో గొప్ప చరిత్ర ఉన్న కోటను ఎవరూ పట్టించుకోకపోవడంతో గుప్త నిధులు, బంగారం, రత్నాలు దొరుకుతాయని భావించిన దుండగులు గదులను కూల్చి తవ్వకాలు జరిపారు. పిచ్చి మొక్కలు పెరగడంతో కట్టడాలు, బురుజు, ఎత్తైన గోడలు శిథిలావస్థకు చేరాయి. అలాగే వందల ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని గ్రామస్తులు వాపోతున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

ఒకరి మృతి.. నలుగురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


సాయితేజ గౌడ్

చేగుంట(తూప్రాన్): కారు చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చేగుంట శివారులోని జీవిక పరిశ్రమ బోనాల్ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... రామాయంపేట మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు కారులో బోనాల వైపునకు వెళుతున్నారు. ఈక్రమంలో కారు వేగంగా చెట్టును ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న నరేశ్, సాయి తేజ్, ప్రణయ్, స్వామిలకు తీవ్రగాయాలు కాగా సాయితేజ గౌడ్(23) మృతి చెందాడు. క్షతగాత్రులను తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు కోసం ఆందోళన


రోడ్డును బాగు చేయాలని ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ర్యాలీ చేపట్టిన కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డును బాగు చేయాలని కాలనీవాసులు పిల్లలతో కలిసి ప్లకార్డులు, బ్యానర్లతో ఆందోళన చేశారు. వివరాలు... ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మిర్చి డెవలపర్స్ వెనిసిటీ, ఎం.పీ.ఆర్ అర్బన్ సిటీ కాలనీ వాసులు పాటీ చౌరస్తా నుంచి అర్బన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మూడు, నాలుగేళ్ల నుంచి రోడ్డును బాగు చేయాలని స్థానిక నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం వందల వాహనాలు ఈ మార్గంలో తిరుగుతాయని, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత గుంతలమయంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర కాశి , యశ్వంత్, శ్రవణ్, వేణు, రాఘవ, శ్రీకాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ ఢీకొని బాలుడు మృతి

సిద్దిపేట జిల్లాలో ఘటన

గజ్వేల్‌రూరల్: కంటైనర్ లారీ ఢీకొని బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రాయపోల్ మండలానికి చెందిన ఎల్కల్ గ్రామానికి చెందిన బాలరాజు, పద్మ దంపతుల కొడుకు హర్షిత్ (10) తల్లిదండ్రులతో కలిసి గిరిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం గజ్వేల్ నుంచి చేగుంటకు వెళుతున్న గుర్తు తెలియని కంటైనర్ వాహనం రోడ్డు దాటుతున్న హర్షిత్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలంలో బాలుడి కుటుంబ సభ్యులు బంధు మిత్రుల రోదనలు మిన్నంటాయి. కాగా ఈ ఘటనలో కంటైనర్ లారీ ఆగకుండా వెళ్లిపోవడంతో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిస్టులతోనే వెట్టి చాకిరి విముక్తి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

సిద్దిపేటఅర్బన్: దొరలు, భూస్వాములు, నైజాంల వెట్టి చాకిరీ నుంచి తెలంగాణను విముక్తి చేసింది కమ్యూనిస్టులేనని, దున్నే వాడికి భూమిని పంచింది ఎర్ర జెండా నేతలేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ పేర్కొన్నారు. సీపీఎం పార్టీ సిద్దిపేట ప్రాంత రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ విశిష్టత-నిర్మాణం అనే అంశంపై రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్ బోధించారు. భూ స్వాములు, దొరల ఆగడాలకు వ్యతిరేకంగా నైజాం ప్రభువును గద్దె దించడానికి గ్రామాన ఎర్రజెండా చేత పట్టి నీ బాంచన్ దొర అన్న వారి చేత బందూక్ పట్టించి పోరాటాలకు సిద్ధం చేసింది ఎర్ర జెండా మాత్రమేనన్నారు. కార్యక్రమంలో రవికుమార్, గోపాలస్వామి, శశిధర్, బాలనర్సయ్య, శిరీషా, శ్రీనివాస్, ప్రశాంత్, కనకయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారుల ఆరా

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీని ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాగారం మున్సిపాలిటీ అధికార బృందం సందర్శించింది. పట్టణంలోని స్వచ్ఛ బడి, రిసోర్స్ పార్క్, కంపోస్టు యార్డు, స్లాటర్ హౌస్‌లను పరిశీలించారు. తడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువుల తయారీ, పొడి చెత్త పునర్వినియోగం తదితర ప్రక్రియ గూర్చి ఆరా తీశారు. వారికి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ వివరించారు. సందర్శించిన వారిలో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, డీఈ సంతోష్, రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వర్ రావు, తదితరులు ఉన్నారు.

21 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట కలిసి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 21 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- తండ్రి అక్కడికక్కడే మృతి
- కుమారుడికి తీవ్ర గాయాలు


కుమ్మరి నర్సింలు

వట్‌పల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో ఘటనాస్థలంలోనే ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం అందోల్ మండల పరిధిలోని సంగుపేట వద్ద 161 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. జోగిపేట ఎస్ఐ పాండు వివరాల ప్రకారం... పుల్కల్ మండలం సింగూరు గ్రామానికి చెందిన కుమ్మరి బాబు, అతని తండ్రి నర్సింలు(60)తో కలిసి ద్విచక్ర వాహనంపై అల్మాయిపేటకు వెళుతుండగా సంగుపేట గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో తండ్రి నర్సింలు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడికి ఎడమ చేయి విరిగింది.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య


సురేశ్

హుస్నాబాద్‌రూరల్: ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని పోతారం(ఎస్)కు చెందిన నమిలికొండ సురేశ్(28) ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు కల్పించడంతో ఆటోలకు కిరాయిలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. కుటుంబ పోషణ, ఆరోగ్య సమస్యల కోసం రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. ఆటో కిరాయిలు రాక అప్పులు తీర్చే మార్గం కనిపించపోవడంతో మనోవేదనకు గురై ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం


పురస్కారంతో ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి

తూప్రాన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320-డీ ఆధ్వర్యంలో 'దిల్ సే గురు వందనం' పేరుతో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు ధవళ ధనలక్ష్మిని సన్మానించారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఆమె ప్రతిభకు ఈ గుర్తింపు దక్కిందని, పురస్కారం అందుకున్న అనంతరం ఆమె మాట్లాడారు. తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, సెక్రెటరీ లయన్ డాక్టర్ జానకిరామ్, మండల విద్యాధికారి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లయన్ డాక్టర్ బాబురావు, విద్యాశాఖ మాజీ కమిషనర్ డాక్టర్ కే.లక్ష్మినారాయణ ఐఎఎస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి


కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సీఐటీయూ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని గొల్లపల్లిలో గల సీసాల పరిశ్రమలో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ సీసాల కంపెనీలో కార్మికులు ప్రమాదకర పరిస్థితిలో పనిచేస్తున్నారని వాపోయారు. ఆరేళ్లుగా కార్మికులు అదే పరిశ్రమలో పనిచేస్తున్నప్పటికీ ఇంకా తక్కువ జీతాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా కార్మికులకు ఈఎస్ఐ ,పీఎఫ్, బోనస్ వంటి సౌకర్యం కూడా కల్పించడం లేదన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: క్రమశిక్షణ, ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం చేవెళ్ల నియోజకవర్గం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ మోకిల పరిధిలోని పీ.ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన 11వ స్టేట్ లెవెల్ సక్సెస్ షోటోకాన్ కరాటే చాంపియన్ షిప్-2025 పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. ఎంతోమంది కరాటే సాధకులకు పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు కుమార్, స్పాన్సర్ వెంకటేశ్‌లను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పత్తి'కి పందుల బెడద

పత్తి కాయలను తింటున్న వైనం

- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- రాత్రి, పగలు చేన్ల వద్దే కాపలా
- పట్టించుకోని అధికారులు


వర్షం నీరు పారడంతో ఎదుగుదల నిలిచిన పత్తి చేను

టేక్మాల్(మెదక్): అతివృష్టి, అనావృష్టితో రైతులు అతలాకుతలమవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటకు తీవ్రం నష్టం వాటిల్లింది. ఉన్న పత్తిని కాపాడుకునేందుకు అన్నదాతలు ప్రయత్నిస్తుంటే అడవిపందులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రింబవళ్లు కంటికి రెప్పలా పంటలను కాపాడుకుంటున్నా ఏదో సమయంలో వచ్చి పందులు పంటలను నాశనం చేస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. పందుల నివారణలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ పంటలు పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న, వరి తదితర వాటిని రైతులు సాగు చేశారు. అత్యధికంగా పత్తి, వరిని సాగు చేస్తున్న పంటలను కాపాడుకోవడానికి రైతన్న పడరాని పాట్లు పడుతున్నాడు. పత్తి పంటలు సాగుకు మొదట్లో సరైన వర్షాలు కురవకపోవడం ఎదుగుదల లేక ఇబ్బంది పడ్డారు. ఇటీవల భారీగా కురిసిన వర్షాల కారణంగా పత్తి చేనులో నీరు చేరి పాడవడంతో గూడు రాలి తీవ్ర నష్టం జరిగింది. అంతేకాకుండా వర్షాల కారణంగా పత్తి మొక్కలు గిడసబారి ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు కలుపు తీయడం, మందులు చల్లడం, పిచికారీ వంటి పనులు చేస్తున్నారు.

రేయింబవళ్లు పంటల వద్దే..

పత్తి చేన్లలో అడవిపందులతోపాటు కోతులు సైతం గుంపులు గుంపులుగా తిరుగుతూ లేత పత్తికాయలను తింటూ తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయంగా పంటల చుట్టూ చీరలు, వైర్లు కట్టడం, సీసాలు కట్టి శబ్దం వచ్చేలా చేస్తున్నారు. పందులు, కోతుల బెడదతో రైతులు చేన్లలోకి వెళ్లేందుకు జంకుతున్నారు. పందులు కొరికి పడేసిన కాయలు కుప్పలు, కుప్పలుగా పడుతున్నాయని కన్నీరు పెట్టుకుంటున్నారు. కంది, వరి పంటలను సైతం నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. మరో నెల రోజుల్లోనే చేతికి వచ్చే పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి పందుల దాడితో పంటలు నష్టం జరిగి కనీసం పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని అన్నదాతలు బాధపడుతున్నారు.


అడవి పందులు తిని పడేసిన పత్తికాయలు

నివారణ చర్యలేవి?

ప్రభుత్వం అడవి పందులను నివారించాలని ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు అమలు చేయడం లేదు. ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. వన్యప్రాణుల బెడద, నివారణ యంత్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. పంటలను కాపాడుకునేందుకు రైతులే నానా రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పంటలను కాపాడుకునేందుకు పరిష్కారం చూపాలని రైతులు వేడుకుంటున్నారు.